

ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 5-10-2026 | సంపుటి - 31 | సంచిక - 133 | రూ : 4 | పేజీలు: 8

రిజర్వేషన్లు వద్దంటే పాకీ పనే గతి

- ఆయన వ్యాఖ్యలపై బీజేపీ, పటేల్, బ్రాహ్మణ సంఘాల తీవ్ర ఆగ్రహం
- వాఘేలాకే రూ.5 లక్షలు ఇస్తామంటూ బీజేపీ నేత ప్రతి సవాల్
- త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఊహాగానాలు



2లో





ఒత్తిడిలో తెలంగాణ యువత.. దేశంలోనే రెండో స్థానం!

- జుట్టు రాలడానికి మానసిక ఒత్తిడే ప్రధాన కారణమన్న నిపుణులు

2లో

- నిద్రలేమి, జీవక్రియ సమస్యలతో తీవ్రమవుతున్న ఆరోగ్య సమస్యలు
- పరిష్కారం కోసం వచ్చేసరికే 55 శాతం మందిలో అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో జుట్టు రాలే సమస్య
- ప్రముఖ హెల్త్ ప్లాట్‌ఫామ్ 'ట్రయా' సర్వేలో వెల్లడి

చొరబాటు యత్నాలు
పాక్ రాయబారికి భారత్ సమన్లు

- పంజాబ్ సరిహద్దుల్లో ఇద్దరు చొరబాటుదారులను కాల్చిచంపిన బీఎస్ఎఫ్
- పాక్ ఆరోపణలను ఖండించిన భారత్.. నార్కోటిక్స్ ముఠాల పనేనని ఆరోపణ
- చనిపోయింది అమాయక పౌరులంటూ భారత దౌత్యవేత్తకు పాక్ నిరసన
- ఘటనపై దర్యాప్తు జరపాలని పరస్పరం డిమాండ్ చేసుకుంటున్న ఇరు దేశాలు



సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్న ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. పంజాబ్ సరిహద్దుల్లో జరిగిన ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ తరువాయి 2లో

919 ఆసుపత్రుల్లో
నగదు రహిత సేవలు

కొత్త ఆరోగ్య పథకం అమలు వేగవంతం

- ఎన్ఈహెచ్ఎస్ ద్వారా 7.56 లక్షల హెల్త్‌కార్డుల డౌన్‌లోడ్
- ప్రభుత్వానికి 'ఈహెచ్‌సీటీ' నివేదిక

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, కుటుంబసభ్యుల కోసం అమల్లోకి తెచ్చిన 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' (ఎన్ఈహెచ్ఎస్) ద్వారా సేవలు క్రమంగా వేగవంతం అవుతున్నాయి. ఇప్పటి వరకు 919 ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకాన్ని నిర్వహించే ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్టు(ఈఎచ్‌సీటీ) ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో తెలిపింది. జులై 17న పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పురోగతిపై సమగ్ర వివరాలను ట్రస్టు.. సర్కారుకు అందజేసింది. నివేదికలోని ముఖ్యాంశాలు.

*** ఈ పథకం కింద 919 ఆసుపత్రులు నమోదయ్యాయి.**

15,395 చికిత్సలకు రూ.104.63 తరువాయి 2లో



ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో
'ముక్కోణపు పోరు'...!

- మూడు కూటములుగా ఏర్పడ్డ సంఘాలు
- పదేళ్ల తర్వాత ఎన్నికలు.. మారిన సమీకరణలు
- ఈ నెల 9న పోలింగ్

హైదరాబాద్: రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పదేళ్ల తర్వాత జరుగుతున్న గుర్తింపు ఎన్నికలు ఈసారి అత్యంత కీలకంగా మారాయి. ప్రధాన కార్మిక సంఘాలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతుండటంతో ఎన్నికల సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. యూనియన్ల మధ్య పోటీగా కాకుండా ఈసారి కార్మిక సంఘాలు వేర్వేరు కూటములుగా ఏర్పడటంతో ముక్కోణపు పోరు నెలకొంది. అధికార కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)కు అనూహ్యంగా మద్దతు ప్రకటించడంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాన సంఘం ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)కు మద్దతు ప్రకటించిన సీపీఐ ఈ ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

*** రెండేసి ఓట్లు.. రాష్ట్ర, రీజియన్ స్థాయి గుర్తింపు**

ఈ ఎన్నికల్లో ప్రతి కార్మికుడికి రెండేసి ఓట్లుంటాయి. ఒకటి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి, మరోటి రీజియన్ స్థాయి గుర్తింపు సంఘానికి ఓటేస్తారు. తరువాయి 2లో



రష్యాలో భారతీయులకు
70 వేల ఉద్యోగాలు!

- నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం
- రష్యాతో వాణిజ్యం పెంపునకు భారత్ ప్రయత్నాలు
- చెన్నై-వ్లాదివోస్టాక్ కారిడార్‌పై కీలక చర్చలు
- రష్యా సైన్యంలో చిక్కుకున్న 140 మంది భారతీయుల విడుదల

భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70,000 మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా తరువాయి 2లో

ఆగ్రహం కాదు, ఉత్సాహం
జైరాం రమేశ్‌కు బాబు, లోకేశ్ కౌంటర్


- మదనపల్లె సభ పై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ట్వీట్
- ప్రజాగ్రహం అంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు
- తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
- అది ప్రజల ఉత్సాహమే తప్ప ఆగ్రహం కాదని చంద్రబాబు వివరణ
- వాస్తవాలు తెలుసుకోకుండా ట్వీట్ చేస్తారా అంటూ లోకేశ్ ఫైర్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ప్రజాగ్రహం కాదని, ప్రజల ఉత్సాహం అని స్పష్టం చేస్తూ ఘాటుగా బదులిచ్చారు. తరువాయి 2లో

విమానాన్ని
కూల్చేయాలనుకున్నా

- ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం
- ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేయాలన్నది తన ప్లానేనన్న కోపైలట్
- విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ
- కెప్టెన్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి దాడి చేశానని వెల్లడి
- హమామ్ సోషల్ మీడియాలో వేలకొద్దీ ఉగ్రవాద పోస్టుల గుర్తింపు
- ఈ కుట్ర వెనుక ఉగ్రసంస్థల హస్తంపై ఇజ్రాయెల్, సౌదీ ఏజెన్సీల దర్యాప్తు 2లో



ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో 'ముక్కోణపు పోరు'!

హైదరాబాద్: రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పదేళ్ల తర్వాత జరుగుతున్న గుర్తింపు ఎన్నికలు ఈసారి అత్యంత కీలకంగా మారాయి. ప్రధాన కార్మిక సంఘాలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతుండటంతో ఎన్నికల సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. యూనియన్ల మధ్య పోటీగా కాకుండా ఈసారి కార్మిక సంఘాలు వేర్వేరు కూటములుగా ఏర్పడటంతో ముక్కోణపు పోరు నెలకొంది. అధికార కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)కు అనూహ్యంగా మద్దతు ప్రకటించడంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాన సంఘం ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)కు మద్దతు ప్రకటించిన సీపీఐ ఈ ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

*** రెండేసి ఓట్లు.. రాష్ట్ర, రీజియన్ స్థాయి గుర్తింపు**

ఈ ఎన్నికల్లో ప్రతి కార్మికుడికి రెండేసి ఓట్లుంటాయి. ఒకటి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి, మరోటి రీజియన్ స్థాయి గుర్తింపు సంఘానికి ఓటేస్తారు. వామపక్ష పార్టీల కార్మిక సంఘాల అనుబంధ సంఘాలు ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) వేర్వేరు కూటముల్లో ఉన్నాయి. ఈయూతో తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) జట్టు కట్టాయి. ఈ కూటమి నుంచి ఈయూ రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి పోటీపడుతోంది. ఆర్టీసీలో మొత్తం 11 రీజియన్లు ఉండగా.. వరంగల్, ఖమ్మం రీజియన్లలో ఎన్ఎంయూ, మిగిలిన తొమ్మిది రీజియన్లలో గుర్తింపు సంఘం కోసం టీఎంయూ ఈ కూటమి నుంచి బరిలో నిలిచింది.

- సీఐటీయూ అనుబంధ ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)తో జట్టు కట్టింది. టీడబ్ల్యూయూ రాష్ట్ర స్థాయితో పాటు తొమ్మిది రీజియన్లలో పోటీ చేస్తోంది. నల్గొండ, ఖమ్మం రీజియన్లలో ఎస్‌డబ్ల్యూఎఫ్‌కు మద్దతు ఇస్తోంది.
- టీజేఎంయూ, బహుజన వర్కర్స్ యూనియన్ మరో కూటమిగా ఏర్పడ్డాయి.

9న పోలింగ్.. 17న లెక్కింపు..

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు చివరిసారిగా 2016లో జరిగాయి. అప్పట్లో టీఎంయూ ఎన్నికవగా 2019లో గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో 37 వేల మందికి ఓటు హక్కు ఉంది. ఈ నెల 9న ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటును ఉపయోగించుకోవచ్చు. 17న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

రష్యాలో భారతీయులకు 70 వేల ఉద్యోగాలు!

భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70,000 మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా అంగీకరించింది. ముఖ్యంగా నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాల్లో ఈ నియామకాలు జర గనున్నాయి. ఈ కీలక విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. భారత్‌రష్యా సంబంధాలపై జరిగిన ఈ సమావేశానికి జైశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా విస్తరించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని, ఇందులో భాగంగా ఏడు కీలక రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇంధన సహకారంపై మాట్లాడుతూ.. బహుళ వనరుల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగించడం ద్వారా భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. చెన్నైవ్లాదివోస్టాక్ కారిడార్, అంతర్జాతీయ నార్త్ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, నార్తర్న్ సీ రూట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. భారత్ యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇదే సమయంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ దౌత్యపరమైన ప్రయత్నాలను జైశంకర్ కమిటీకి వివరించారు. చర్చలు, శాంతియుత పరిష్కారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. రష్యా సైన్యంలో సహాయక విధుల పేరుతో చిక్కుకున్న భారతీయ పౌరుల విడుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన సభ్యులకు తెలియజేశారు. ఇప్పటివరకు సుమారు 140 మందిని సురక్షితంగా విడిపించామని, మరో 55 మంది ఆచూకీ కోసం రష్యా అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

విమానాన్ని కూల్చేయాలనుకున్నా ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్‌హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో (crash axe) దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

రిజర్వేషన్లు వద్దంటే పాకీ పనే గతి

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నేత శంకర్‌సింహ్ వాఘేలా చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. రిజర్వేషన్లను వ్యతిరేకించే అగ్రవర్ణాల వారు మ్యానువల్ స్కావెంజింగ్ (పారిశుద్ధ్య పనులు) చేస్తే నెలకు రూ.50,000 ఇస్తానని ఆయన చేసిన సవాల్ వివాదాస్పదంగా మారింది. నర్మదా జిల్లాలోని సాగ్‌బారాలో అక్టోబర్ 2న జరిగిన ఆదివాసీ రైతుల సమావేశంలో వాఘేలా మాట్లాడారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ.. అది ఎవరూ ఇస్తున్న భిక్ష కాదని, దశాబ్దాలుగా అనుభవించిన వివక్షకు బదులుగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే పటేల్, బనియా, బ్రాహ్మణ సామాజిక వర్గాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. వాఘేలా వ్యాఖ్యలపై బీజేపీ, పాటీదార్, బ్రాహ్మణ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

919 ఆసుపత్రుల్లో నగదు రహిత సేవలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, కుటుంబసభ్యుల కోసం అమల్లోకి తెచ్చిన 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' (ఎన్ఈహెచ్ఎస్) ద్వారా సేవలు క్రమంగా వేగవంతం అవుతున్నాయి. ఇప్పటి వరకు 919 ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకాన్ని నిర్వహించే ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్టు (ఈఎచ్‌సీటీ) ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో తెలిపింది. జులై 17న పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు పురోగతిపై సమగ్ర వివరాలను ట్రస్టు.. సర్కారుకు అందజేసింది. నివేదికలోని ముఖ్యాంశాలు.

- ఈ పథకం కింద 919 ఆసుపత్రులు నమోదయ్యాయి.
- 15,395 చికిత్సలకు రూ.104.63 కోట్ల ముందస్తు అనుమతులు రాగా.. వీటిలో 778 ప్రైవేటు, 141 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి.
- సెప్టెంబరు 1 నుంచి పోలీసు శాఖను కూడా ఈ పథకంలో చేర్చారు.
- పథకం నిర్వహణకు ఉద్యోగులు, పింఛనుదారుల నుంచి నెలకు రూ.44 కోట్లు సమకూరుతున్నాయి. ప్రభుత్వం మరో రూ.44 కోట్లు అందిస్తోంది. ప్రతి నెలా రూ.88 కోట్ల నిధులు ఈహెచ్ఎస్ కింద అందుబాటులోకి వస్తున్నాయి.
- పథకానికి వార్షిక బడ్జెట్ రూ.1,056 కోట్లుగా అంచనా వేశారు. ఆసుపత్రిలో చేరి చికిత్స పొందే సేవలతోపాటు ఔట్ పేషెంట్ సేవలనూ పథకంలో చేర్చారు. వెల్‌నెస్ కేంద్రాల్లో వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు, మందులను నగదురహితంగా అందిస్తున్నారు.
- ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. మరో 25 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో 21 కేంద్రాలను వివిధ జిల్లాల్లో, నాలుగింటిని హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.
- ఇన్‌పేషెంట్ వైద్య సేవలకు 1,816 సీజీహెచ్ఎస్ చికిత్స ప్యాకేజీలను అమలు చేస్తున్నారు.
- హెల్త్ కార్డు జారీ కాలేదన్న కారణంతో అర్హులకు వైద్య సేవలను నిరాకరించరాదని అధికారులు స్పష్టం చేశారు. ఉద్యోగులు, పింఛనుదారులు తమ గుర్తింపు సంఖ్య ఆధారంగా వైద్య సేవలు పొందవచ్చు. సెప్టెంబర్ 28 నాటికి 12,56,962 మంది లబ్ధిదారులకు హెల్త్‌కార్డులు అందుబాటులోకి రాగా.. 7,56,210 మంది వాటిని డౌన్‌లోడ్ చేసుకున్నారు.

బకాయిల్లో రూ.70 కోట్ల విడుదల

- కొత్త పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పాత ఈహెచ్ఎస్‌కు సంబంధించిన బకాయిల్లో రూ.70 కోట్లు తాజాగా విడుదల చేసినట్లు నివేదిక స్పష్టం చేసింది. ఇంకా రూ.100.52 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రైవేటు ఆసుపత్రులకు రూ.23.85 కోట్లు, ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.76.67 కోట్ల బకాయిలు ఉన్నాయి.
- లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా 30 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

ఆగ్రహం కాదు, ఉత్సాహం: జైరాం రమేశ్‌కు బాబు, లోకేశ్ కౌంటర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ప్రజాగ్రహం కాదని, ప్రజల ఉత్సాహం అని స్పష్టం చేస్తూ ఘాటుగా బదులిచ్చారు.

అసలేం జరిగింది?

ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతుండగా, సభలో ఉన్న కొందరు యువకులు కేకలు, అరుపులతో కాస్త గందరగోళం సృష్టించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని, వారిని శాంతపరిచి ప్రసంగం సజావుగా సాగేలా చూశారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జోడించాడు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.

చంద్రబాబు, లోకేశ్ తీవ్ర స్పందన

జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "జైరాం జీ, జరిగిన దానికి మీ వ్యాఖ్యానానికి ఏమాత్రం సంబంధం లేదు. మీరు దేన్నైతే ప్రజాగ్రహం అని తప్పుగా చిత్రీకరించాలని చూస్తున్నారో, అది వాస్తవానికి ప్రజల నుంచి వచ్చిన అపూర్వమైన, ఉత్సాహపూరితమైన స్పందన. సభలో వారి ఉత్సాహం అధికంగా ఉండటంతో, కార్యక్రమం సజావుగా సాగేందుకు నేను జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ప్రజల ఉత్సాహాన్ని ఆగ్రహంగా పొరబడటం చూస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు మీరు ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోంది. రాజకీయ ప్రేరేపిత సోషల్ మీడియా కథనాలతో వాస్తవాలను మార్చలేరు" అని చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. "ఫేక్ న్యూస్‌ను తయారుచేసేది ఇలాగే. సీనియర్ కాంగ్రెస్ నేతలు వాస్తవాలను కూడా సరిచూసుకోకుండా దాన్ని ప్రచారం చేస్తారు. ఉద్యోగాలు కావాలంటూ ఆర్థిక మంత్రి ప్రసంగానికి స్థానిక యువత అంతరాయం కలిగించారన్నది పూర్తిగా అవాస్తవం. ప్రజలతో సాధారణ సంభాషణను ఉద్దేశపూర్వకంగా కత్తిరించి, పక్రీకరించి కట్టుకథ అల్లుతున్నారు. జైరాం రమేశ్ గారూ, మీలాంటి సీనియర్ నేత ట్వీట్ చేసే ముందు వాస్తవాలు సరిచూసుకోవాలి. ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం తగదు. ఆ అబద్ధాన్నితొలగించండి" అని లోకేశ్ డిమాండ్ చేశారు.

చొరబాటు యత్నాలు: పాక్ రాయబారికి భారత్ సమన్లు

సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్న ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. పంజాబ్ సరిహద్దుల్లో జరిగిన ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించారు. వెనక్కి వెళ్లిపోవాలని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. పైగా సరిహద్దు కంచె వైపు దూసుకెళ్తుండటంతో వారిని భద్రతకు ముప్పుగా భావించిన బీఎస్ఎఫ్ బలగాలు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఈ ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి, దురుద్దేశంతో కూడినవని భారత్ కొట్టిపారేసింది. పాకిస్థాన్ నుంచి పనిచేస్తున్న సాయుధ నార్కోటిక్స్ సిండికేట్ల కార్యకలాపాల్లో భాగంగానే ఈ చొరబాట్లు జరుగుతున్నాయని ఆరోపించింది. ఇలాంటి కార్యకలాపాలపై, అలాగే దీని వెనుక పాకిస్థాన్ సరిహద్దు దళాల ప్రమేయం ఉందన్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఇస్లామాబాద్‌ను భారత్ డిమాండ్ చేసింది. సరిదిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ సరిహద్దు పవిత్రతను గౌరవించాలని హితవు పలికింది. మరోవైపు, ఈ ఘటనపై పాకిస్థాన్ కూడా తీవ్రంగానే స్పందించింది. ఇస్లామాబాద్‌లోని భారత అగ్రశ్రేణి దౌత్యవేత్తను పిలిపించి నిరసన తెలియజేసింది. బీఎస్ఎఫ్ కాల్పుల్లో మరణించిన ఇద్దరూ నిరాయుధులైన అమాయక పౌరులని ఆరోపించింది. ఈ ఘటనపై తక్షణమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. ఈ విధంగా ఒకే ఘటనపై ఇరు దేశాలు భిన్న వాదనలు వినిపిస్తూ, దౌత్యపరమైన నిరసనలు తెలుపుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఒత్తిడిలో తెలంగాణ యువత.. దేశంలోనే రెండో స్థానం!

తెలంగాణ యువత తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ముఖ్యంగా పురుషుల్లో జుట్టు రాలడానికి దారితీస్తున్న జీవనశైలి సంక్షోభంలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రముఖ హెల్త్ ప్లాట్‌ఫామ్ 'ట్రయా' దేశవ్యాప్తంగా 5.6 లక్షల మంది పురుషులపై జరిపిన భారీ అధ్యయనంలో ఈ విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి.

సర్వేలో ఏం తేలిందంటే?

దేశవ్యాప్తంగా 29 నుంచి 31 ఏళ్ల వయసున్న పురుషులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఈ సర్వే తేల్చింది. జాతీయ స్థాయిలో ఒత్తిడి సగటు 54.6 శాతం ఉండగా, తెలంగాణలో ఇది ఏకంగా 63.6 శాతంగా నమోదైంది. దీంతో దేశంలో అత్యధిక ఒత్తిడి ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. కేవలం ఒత్తిడే కాదు, నిద్రలేమి సమస్యలోనూ మన యువత ముందుంది. జాతీయ సగటు 29.5 శాతం అయితే, తెలంగాణలో 36.7 శాతం మంది యువకులు నిద్రలేమితో బాధపడుతూ దేశంలో రెండో స్థానంలో ఉన్నారు. ఇక జీవక్రియ మందగించడం (మెటబాలిజం) విషయంలో 50.7 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. ఈ మూడు సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి యువత ఆరోగ్యాన్ని, ముఖ్యంగా వారి కేశ సంపదను దెబ్బతీస్తున్నాయి.

*** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

'సర్'పై కాంగ్రెస్ ఆరోపణల్లో నిజం లేదు

హైదరాబాద్: సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'సర్ ప్రక్రియను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగమే నిర్వహిస్తోంది. అభ్యంతరాలుంటే ఎన్నికల సంఘం క్షేత్రస్థాయి విచారణ జరిపిన తర్వాత మాత్రమే ఓట్ల తొలగింపుపై నిర్ణయం తీసుకుంటుంది. ఫారం 7 సమర్పించినంత మాత్రాన ఓట్లు నేరుగా తొలగించరు. దొంగ ఓట్లు, నకిలీ ఓట్ల ఏరివేత కోసమే నిబంధనల ప్రకారం ఫారం 7 విధానం ఉంది. పైగా భాజపాకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏ 1, బీఎల్ఏ 2) ఎవరూ కూడా అటువంటి దరఖాస్తులు సమర్పించలేదు. విచారణ దశలోనే ఉన్న అంశంపై ఇప్పుడే ఓట్లు తొలగించేస్తున్నారంటూ కాంగ్రెస్ రాద్ధాంతం చేయడం అభ్యంతరకరం. రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోంది' అని రామచందర్‌రావు మండిపడ్డారు.



ముస్లిం గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవాలి



భూపాలపల్లి (ప్రజాస్ఫూర్తి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని భూపాలపల్లి మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మొహమ్మద్ ఇర్ఫాన్ కోరారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల సంఘం కొత్త ఓటరు జాబితా ప్రక్రియను చేపట్టిందని తెలిపారు.గతంలో గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదైన వారు సైతం ఫారం18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 6, 2026 ఫారం18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని తెలిపారు.తెలంగాణలో సుమారు 3.5 లక్షల మంది ముస్లిం గ్రాడ్యుయేట్లు ఉన్నప్పటికీ, తనకు అందిన సమాచారం మేరకు కేవలం 40-45 వేల మంది మాత్రమే గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకుంటున్నారని ఇర్ఫాన్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా, మండల, పట్టణ స్థాయిలోని ముస్లిం సోదరులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.అర్హత కలిగిన ప్రతి ముస్లిం గ్రాడ్యుయేట్ ఫారం 18ను పూర్తి చేసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

సిపిఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండ పట్టణ కేంద్రంలో జరగనున్న అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ పిలుపునిచ్చారు.మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో రైతులు అరకొర బోర్లు, బావుల కింద వ్యవసాయం చేశారని, పండిన పంట చేతికి వస్తుందో రాదో అనే ఆందోళనలో రైతాంగం ఉందన్నారు. రైతులకు 16 గంటల నిరంతర విద్యుత్ అందించాలని, రైతు రుణమాఫీ, రైతుబంధును వెంటనే అమలు చేయాలని, ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పందిరి వీరారెడ్డి, కుసుమ భిక్షమారెడ్డి, రాఘవరెడ్డి, చిలకర పెంటయ్య, పోలేపల్లి లచ్చయ్య, నాగవల్లి నాగరాజు, చిలక భిక్షం, పుల్లమ్మ, నాగమణి, ఎం. వీరస్వామి, పిట్ట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం

: సిపిఐ ఆందోళన



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :మహబూబాబాద్ మున్సిపాలిటీలో గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిందని, ప్రతి నెలా ఇదే తంతు కొనసాగుతోందని సిపిఐ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి ఆరోపించారు.ఆదివారం మిషన్ భగీరథ కార్యాలయం ఎదుట సిపిఐ కౌన్సిలర్లు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 1, 2 తేదీల్లో నీళ్లు బంద్ అని చెప్పి,ఆ తర్వాత రెండు రోజులు కూడా ఇవ్వలేదని అన్నారు. పైప్ లైన్ పగిలిందని, లీకేజీలు,హైవే పనులు అంటూ కారణాలు చెబుతున్నారని విమర్శించారు..పదేళ్లుగా మిషన్ భగీరథ పనులు పూర్తి కావడం లేదని, ప్రత్యామ్నాయంగా మున్నేరు ఏటిగడ్డ వద్ద ఉన్న పాత సంప్ హౌస్ ను పునరుద్ధరించాలని, మిషన్ భగీరథపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దేశపల్లి నవీన్,నర్రా సంధ్యా శ్రవణ్,నాయకులు పెరుగు కుమార్,మంద శంకర్,రాగం మల్లయ్య,నీలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో ఘనంగా గిలిగింతల రక్తదాన శిబిరం



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం జిల్లా:ఖమ్మం పట్టణంలో స్థానిక కందగట్ల ఫంక్షన్ హాల్ నందు గిలిగింతల ఫేస్ బుక్ ఫౌండర్ జగన్మోహన్ మిరియాల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ఘనంగా జరిగింది. రక్తదానం ప్రాణదానం అనే సందేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు రక్తాన్ని సేకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డా. తుమ్మల యుగంధర్, డా.గడల శ్రీనివాసరావు, డా. కూరపాటి ప్రదీప్ కుమార్,ఎండీ పీడియాట్రిక్స్, ఆర్.కె. సాగర్, అలాగే విజయబాబు ఏసీపీ ఖమ్మం, తదితరులు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేయడం ద్వారా తలసేమియా బాధితులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని వారు పేర్కొన్నారు.రక్తదాన శిబిరంతో పాటు నిర్వహించిన చిన్నారుల డాన్స్‌లు, సాంస్కృతిక ,వినోద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సేవా కార్యక్రమంతో పాటు చిన్నారుల ప్రతిభకు వేదిక కల్పించిన గిలిగింతల కార్యక్రమం అభినందనీయం అని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల నుండి ఫేస్బుక్ గిలిగింతల సబ్స్క్రైబర్స్ అందరూ పాల్గొన్నారు.

తెలంగాణ మట్టి బిడ్డల స్ఫూర్తితోనే జనసేన ఆవిర్భావం

: ఎమ్మెల్సీ ఎన్నికలు జనసేనకు సెమీఫైనల్స్

: పట్టభద్రులు గడల శ్రీనివాసరావును గెలిపించాలి

: జనసేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ మట్టి బిడ్డల నుంచి పొందిన స్ఫూర్తితోనే పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ తెలంగాణ గడ్డపై ఆవిర్భవించిందని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం జయశ్రీ గార్డెన్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గడాల శ్రీనివాసరావుకు జన సైనికులు ఘనంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదులో అత్యధిక సంఖ్యలో సభ్యులను చేర్పించిన వివిధ నియోజకవర్గాల నాయకులను వేదికపై ఘనంగా సన్మానించారు. అనంతరం గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సుమారు 1,200మంది యువత బలిదానాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ, ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2,500, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడతామని ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమయ్యాయి అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా హామీల్లో కనీసం 20శాతం కూడా అమలు కాలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ మూడేళ్ల పాలన పూర్తయిన నేపథ్యంలో ప్రజల తరపున ప్రశ్నించేందుకు జనసేన పార్టీ రంగంలోకి దిగిందన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం సాధించేందుకు జనసేన కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జనసేనకు సెమీఫైనల్స్ అని, పట్టభద్రులు తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఉద్యమాల పురిటిగడ్డ నల్గొండ జిల్లా నుంచే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార యుద్ధాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. పవన్ కళ్యాణ్ తెలంగాణకు వస్తున్నారని, ఆయన రాకతో తెలంగాణ రాజకీయాల్లో మార్పు రావడం ఖాయమన్నారు.

*** జనసేనకు రూ.లక్ష విరాళం:**

జనసేన ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం రూ.లక్ష విలువైన చెక్కును విరాళంగా అందజేశారు. ఒక ఆశయం, లక్ష్యం,సిద్ధాంతంతో పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేనకు పట్టభద్రులు అండగా నిలిచి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో జనసేన తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్ము రెడ్డి ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్, శర్మ, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ, శివ కార్తీక్, లక్ష్మణ్ గౌడ్, పీక ప్రవీణ్, మామిడాల రమేశ్, శ్రీకాంత్, లింగస్వామి, బద్రి రాజు, పాండు, ప్రవీణ్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్‌లో కాంగ్రెస్‌కు భారీ బలం

*** కాంగ్రెస్‌లోకి 500 మందికి పైగా భారీ చేరికలు**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి:మల్కాజిగిరి నియోజకవర్గంలోని నేరేడ్‌మెట్ 136వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీగా బలం చేకూరింది. మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన సుమారు 500 మంది నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాలనీ సభ్యులు, యువత కాంగ్రెస్ పార్టీలో చేరారు.మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. అనంతరం ఆమెతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికల కార్యక్రమంలో నేరేడ్‌మెట్ రజక సంఘం, నేరేడ్‌మెట్ ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్, వివేకానందపురం యువత, ఆర్‌కే పురం యువత, సీబీఎన్ కాలనీ యువతతో పాటు వివిధ కాలనీలకు చెందిన సభ్యులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంత్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు,ప్రజా సంక్షేమ విధానాలపై నమ్మకంతో పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.ఆర్. ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు రాఘవన్, శ్యామ్, శ్రీనివాస్ యాదవ్, సాయి, భాస్కర్, ఆల్బర్ట్, సుధీర్, రాములు, రమేష్, జాన్, జోషియా, రజక సంఘం అధ్యక్షుడు కృష్ణ, శేఖర్, శివ, ప్రభాకర్, భరత్. ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, ఉస్మాన్, పద్మారావు, సత్తిబాబు, రమేష్, అశోక్, మల్లేష్, ప్రవీణ్, దేవ్, అశ్విన్, మధు యాదవ్ తదితర అసోసియేషన్ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, యువత తదితరులు పాల్గొన్నారు

కొకుంట్ల గ్రామంలో మాజీ మంత్రి ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు



వికారాబాద్ ప్రజాస్ఫూర్తి:వికారాబాద్ జిల్లా, నవాబుపేట్ మండలం, కొకుంట్ల: కొకుంట్ల గ్రామంలో దివంగత మాజీ హోంమంత్రి పి. ఇంద్రారెడ్డి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అంతమొల్ల దయాకర్ రెడ్డి పాల్గొని అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హోంమంత్రిగా ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గంలోనే బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు భరత్ రెడ్డి, ముఖ్య సలహాదారు మొహమ్మద్ గౌస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తమ్ చారి, , అక్కాపూర్ సర్పంచ్ బందయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి పోలీస్ మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్య రెడ్డి, కృష్ణ రెడ్డి,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కావాలి రాజు రైతు సంఘం అధ్యక్షుడు మల్లేశం, సోషల్ మీడియా అధ్యక్షులు తలారి శేఖర్,సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి కుమార్ కెసిఆర్ సేవ దళ్ అధ్యక్షులు మాణిక్య రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను రోడ్డున పడేయడం సరికాదు: రవి పటేల్



భూపాలపల్లి,(ప్రజాస్ఫూర్తి):రోడ్డు విస్తరణ పేరుతో చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అన్నారు. తమ జీవనోపాధిని కాపాడాలని కోరుతూ చిరు వ్యాపారులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణకాలనీ-జంగేడు రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపల్ అధికారులు పూలు, పండ్ల బండ్లు, మంగలి దుకాణాలు, టీ దుకాణాలు, కిల్లీ కోట్లు తదితర చిరు వ్యాపార సముదాయాలను తొలగించడాన్ని ఆయన ఖండించారు.దసరా పండుగకు ముందు దుకాణాలను తొలగించి, చిరు వ్యాపారుల కుటుంబాలను రోడ్డున పడేయడం బాధాకరమన్నారు. రోడ్డు విస్తరణ అవసరమే అయినప్పటికీ, ఏళ్ల తరబడి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా దుకాణాలను తొలగించడం సమంజసం కాదన్నారు. ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక కుటుంబాలకు చిరు వ్యాపారాలే జీవనాధారమని పేర్కొన్నారు. కూల్చివేతలతో నష్టపోయిన ప్రతి చిరు వ్యాపారికి రూ.50 వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి చిరు వ్యాపారుల సమస్యను పరిష్కరించాలని కోరారు. వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని అన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే చిరు వ్యాపారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. చిరు వ్యాపారులు చేపట్టే న్యాయబద్ధమైన పోరాటాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.ఈకార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ 19 నెట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచిన చిగుర్తి యశ్వంత్



ప్రజాస్ఫూర్తి , ఖమ్మం జిల్లా : ఖమ్మం,ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ విద్యార్థి చిగుర్తి యశ్వంత్ క్రీడా రంగంలో తన ప్రతిభను చాటుకున్నాడు. హార్వెస్ట్ స్కూల్లో నిర్వహించిన అండర్19 నెట్‌బాల్ సెలక్షన్లలో అర్హత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, తన గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ రాజారెడ్డి,పాఠశాల యాజమాన్యం యశ్వంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

కోతలు లేని కరెంట్ ఇచ్చి పొట్ట దశలో వున్న వరి పైరును కాపాడాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి: కోతలు లేని కరెంట్ ఇచ్చి పొట్ట దశలో వున్న వరి పైరును కాపాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రం లో సిపిఐ మండల సమితి సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ నాణ్యమైనది ఇస్తామని,గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం కంటే కూడా రైతులకు ఇబ్బంది లేకుండా కరెంటు ఇస్తామని చెప్పి, ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని,ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులను పట్టించుకోవడం లేదని ప్రస్తుతం కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉన్నదని రోజుకు కనీసం 8, 9 గంటల కరెంటు కూడా ఇవ్వటం లేదని ఆ ఇచ్చే కరెంటు కూడా ఎన్నిసార్లు వస్తుందో ఎన్నిసార్లు పోతుందో తెలియటం లేదని పట్టిన మడే పట్టి కిందికి నీళ్లు దిగటం లేదని రోజుకు 24 గంటలు కాదు కనీసం కరెంటు 16 గంటలైనా కరెంట్ ఇస్తే తప్ప వేసిన పంటలు దక్కవని, కరెంట్ ఇవ్వకుంటే రైతులు నట్టేట మునగక తప్పదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య,ఏఐటియుసి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి చెవ్వ వెంకన్న, వెంకటరెడ్డి పోకల ఆంజనేయులు, తిరగమళ్ళ కిరణ్, కట్టా అశోక్,పంగ గోవిందు,ప్రధాని సైదులు తదితరులు పాల్గొన్నారు

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులకు సన్మానం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ బండారు రాజా కమిటీ సభ్యులు తోట శ్యాంప్రసాద్, వెంపటి పురుషోత్తం లను దేవాలయ చైర్మెన్ పోతుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్యులు,భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఆపదలో ఉన్న వారికి రక్తం అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్య నిర్వహణ అధికారి లక్ష్మణ రావు, కౌన్సిలర్ గండూరి రమేష్ నాయకులు తప్పి గాంధీ,కలకోట లక్ష్మయ్య,యమా ప్రభాకర్, వెంపటి శబరినాథ్, చల్లా సత్యనారాయణ, ఉప్పలంచు కృష్ణ,కొండ శ్రీనివాస రావు, చిత్తలూరు శ్రీధర్,తెరటపల్లి సతీష్, నవిలి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం కోసం రూ.1000116ల భారీ విరాళం



ప్రజాస్ఫూర్తి , జన్నారం:మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయ ఆలయ గర్భగుడి నిర్మాణం కోసం చింతగూడ గ్రామానికి చెందిన చెన్నమాధవుని రామరాజు లీలాదేవి పుత్రుడు చెన్నమాధవుని శ్రీధర్ రాజు మహిజ (అమెరికా) దంపతులు తాను జన్మించిన ఊరు పై మమకారంతో (10,00116/) రూపాయలను భారీ విరాళంగా అందజేశారు.దాతల కుటుంబం అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆలయ కమిటీ గ్రామ ప్రజలు కోరుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

13వ సారి ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడిగా చింతల రమేష్



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): చిట్యాల మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చింతల రమేష్ ముదిరాజ్ 13వసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కోడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా చింతల రమేష్, ఉపాధ్యక్షుడిగా పోశాల రాజు (బాబారాజు), ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి అశోక్, కోశాధికారిగా మాచర్ల సంజీవ్, సహాయ కార్యదర్శిగా బయగాని సందీప్, ప్రచార కార్యదర్శిగా గుర్రం తిరుపతి ఎన్నికయ్యారు. ప్రత్యేక కమిటీ సభ్యులుగా పోశాల రాజు, కట్కూరి రాజు, రాజేందర్, రమేష్, సాంబయ్య, కిరణ్‌లను ఎన్నుకున్నారు. చింతల రమేష్ గత 24 సంవత్సరాలుగా అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారని, మండల స్థాయిలో ఉన్న ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంఘాన్ని రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందేలా చేయడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని పలువురు ఫోటోగ్రాఫర్లు పేర్కొన్నారు. వరుసగా 13వసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చింతల రమేష్‌ను ఫోటోగ్రాఫర్లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల సీనియర్ ఫోటోగ్రాఫర్లు పుల్ల రవితేజ, మెరుగు మహేందర్, సత్యసాయి రాజు, టేకు రవి, సతీష్‌తో పాటు జూనియర్ ఫోటోగ్రాఫర్లు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఉచిత కంటి పరీక్షలు



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి. మండల పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ పరిధి లోసర్పంచ్ కట్ట కళ్యాణి అశోక్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సూర్యాపేట వారి సహకారంతోఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగినది ఈ ఉచిత కంటి పరీక్షలు గ్రామంలో ఉన్న నిరుపేదంతరు వినియోగించుకొని లబ్ధి పొందాలని కోరినారు ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ నకిరకంటి వెంకటమ్మ వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు సర్పంచ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సూర్యాపేట వారు చేస్తున్న కృషిని అభినందించారు .

సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి:రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సెక్రటేరియట్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన బునాదిగాని కాలువ పనులను వేగవంతం చేయడం, ప్యాకేజీ 16లో భాగంగా చేపడుతున్న బస్వాపూర్ హై లెవల్ కెనాల్ పనులు తదితర అంశాలను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంతో పాటు భూసేకరణ సమస్యలను పరిష్కరించి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సమీక్షలో ప్రాజెక్టుల భూసేకరణ, పెండింగ్ పనులు, ఇతర కీలక అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

పిల్లుట్ల రఘుకు సేవా రత్నం అవార్డు



* **గరిడేపల్లి లో ఘన సన్మానం**

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: ఓజో ఫౌండేషన్ అధినేత, హుజూర్‌నగర్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు పిల్లుట్ల రఘు ఈ ప్రాంతానికి దొరికిన రత్నం లాంటివాడని గరిడేపల్లి మండల మాజీ ప్రజా ప్రతినిధులు, బి ఆర్ ఎస్ నాయకులు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ కోటలో సేవారత్నం అవార్డు అందుకుని డాక్టరేట్ పొందిన పిల్లుట్ల రఘుకు ఆదివారం మండల కేంద్రమైన గరిడేపల్లి లో మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు బి ఆర్ ఎస్ నాయకులు ఓజో ఫౌండేషన్ ద్వారానే కాకుండా వీఆర్ఎస్ పార్టీ ద్వారా ఆయన ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొందాలని వారు ఆకాంక్షించారు. గత కొన్ని సంవత్సరాలుగా సమాజ సేవే లక్ష్యంగా ఫౌండేషన్ అనే సంస్థను ప్రారంభించి దాని ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడమే కాక, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ అందరిలో గుర్తింపు తెచ్చుకున్న పిల్లుట్ల రఘుకు సేవారత్నం అవార్డు రావడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ గడేపల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్, సింగిల్ విండో మాజీ చైర్మన్ వీరం రెడ్డి శంబిరెడ్డి, గుత్తికొండ వెంకటరమణారెడ్డి, మన్నెం వేణు యాదవ్, సర్పంచులు మాలోతు సుధాకర్, వాంకుడోత్ రవి నాయక్, మచ్చ ముత్తమ్మ మురళి, మాజీ సర్పంచులు నల్లపాటి వీరమ్మ భాస్కర్, కోట వీరస్వామి, గ్రామ శాఖ అధ్యక్షులు ముంగి అచ్చయ్య, నరేందర్ నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు సందీప్ నాయక్, యూత్ అధ్యక్షులు మండల నాగేశ్వరరావు, దొంత గాని రాంబాబు, భోగాల నిరంజన్ రెడ్డి, దాసరి వీరస్వామి, బచ్చలకూరి కోటయ్య, రవీందర్ నాయక్, నరసింహ తోపాటు పలువురు బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పులిగిల్ల బాలయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ చామల



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: టీపీసీసీ ఎన్సీ డిపార్ట్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిగిల్ల బాలయ్య తండ్రి పులిగిల్ల యాదగిరి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లి పులిగిల్ల బాలయ్య కుటుంబాన్ని పరామర్శించారు.యాదగిరి మృతికి సంతాపం వ్యక్తం చేసిన ఎంపీ..కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఎంపీ వెంట భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ పిసిసి డెలిగేట్ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్ కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ పడిగల ప్రదీప్ ,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అతహర్ ,ముత్తిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ రాంపల్లి కృష్ణ , ఉప సర్పంచ్ అందే మల్లేష్ , కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మెరుగు స్వామి ,గంగసానిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు బోయిని నాగేష్ , ముత్తిరెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ అబ్బయ్య , రాగుల రవీందర్ యూత్ కాంగ్రెస్ నాయకులు వివిధ కుల సంఘాల నాయకులు మహిళలు పాల్గొన్నారు...

పోనకల్‌లో ఘనంగా మెగా ఉచిత వైద్య శిబిరం



ప్రజాస్ఫూర్తి , జన్నారం:మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని స్లేట్ సీబీఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం చంద న్యూరో , ట్రామా కేర్ సెంటర్ వారి సహకారంతో పోనకల్‌ల సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక స్లేట్ సిబిఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో మండలంలోని 29 గ్రామపంచాయతీల నుంచి సుమారు 300 మంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రక్తపోటు,నరాల బలహీనత,వెన్నుముక నొప్పి , మెడ నొప్పులు, మధుమేహం, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఉచిత వైద్య పరీక్షలతో పాటు వచ్చిన ప్రజలందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ లీలా శర్వాణి, డాక్టర్ స్వాతి మరియు వారి సిబ్బంది కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ,లయన్స్ క్లబ్ రీజియన్ సెక్రెటరీ కస్తూరి సతీష్ కుమార్, ప్రెసిడెంట్ బండారి మారుతి రాజు ,సెక్రెటరీ గోలి రామకృష్ణ సభ్యులు నరేందుల గోపి, ఎర్ర ప్రవీణ్ కుమార్, జాజాల శ్రీనివాస్, వావిలాల రాజు, సూధం సంతోష్ , బాసెట్టి మనోహర్ , కొత్త తిరుపతి, రంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు గుర్తు , కాగడ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి



ప్రజాస్ఫూర్తి,సూర్యాపేట: బస్సు గుర్తు , కాగడ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వరంగల్ రీజియన్ ఉపాధ్యక్షుడు కుర్ర సురేందర్ గౌడ్ అన్నారు.ఆదివారం జరిగిన ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఉద్యోగుల సమావేశంలో వరంగల్ రీజియన్ ఉపాధ్యక్షుడు కుర్ర సురేందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే ఎన్నికల్లో భాగంగా జనగామ డిపో ఆర్టీసీలో జరగబోయే ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ , నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కొంతమంది స్వార్థపరులు అధికార పార్టీ నాయకులకు మాయ మాటలు చెప్పి వారి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి మనం వ్యతిరేకం అన్నట్లుగా చిత్రీకరించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్న నాయకులకు మన ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు శ్రీరామ్ రెడ్డి, శ్రీనివాస్, బాలరాజు, వీరేందర్, మీన్యా, అశోక్, సునీత మరియు ఎంప్లాయిస్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ కూటమిని గెలిపించాలి

* **ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కోరిమి రాజ్‌కుమార్**



భూపాలపల్లి,(ప్రజాస్ఫూర్తి):ఈ నెల 9న నిర్వహించనున్న ఆర్టీసీ కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ బలపరిచిన కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కోరిమి రాజ్‌కుమార్ కార్మికులను కోరారు. ఆదివారం భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో కార్మికులను కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ కమిటీ కార్యదర్శి రాజన్నతో కలిసి కార్మికులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కోరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. డ్రైవర్లు, కండక్టర్ల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పెండింగ్ బకాయిల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జయ శంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మొటపలుకుల రమేష్, కార్యదర్శి క్యాత రాజు సతీష్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ జి. సుధాకర్‌రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్, సీపీఐ 24వ వార్డు కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్, నూకల చంద్రమౌళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జోసెఫ్, కేటీపీపీ రీజినల్ కమిటీ అధ్యక్షుడు కోలా శ్యామ్, కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

* **బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు**



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి:కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని హుజూర్‌నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు అన్నారు. గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ఆయన ఆత్మీయంగా పరామర్శించారు.గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దొంతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తండ్రి దొంతిరెడ్డి వీరారెడ్డి, పాత అప్పన్నపేటకు చెందిన పార్టీ నాయకులు ఎల్లుట్ల రమేష్, వెంకటేశ్వర్లు మాతృమూర్తి దివంగత ఎల్లుట్ల లక్ష్మమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పిల్లుట్ల రఘు బాధిత కుటుంబాల నివాసాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ వారికి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు కృష్ణ నాయక్ వీరం రెడ్డి శంబిరెడ్డి మన్నెం వేణు యాదవ్ బిఆర్ఎస్ పార్టీ వార్డ్ నెంబర్లు భాస్కర్ ఆదెమ్మ లావణ్య బిఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణ వెంకటేశ్వర్లు శీను సంజీవ్ పుల్లయ్య బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబీసీ సింహగర్జన సభకు తరలివెళ్ళిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాస్ఫూర్తి ,షాద్‌నగర్:శంషాబాద్ మండలం గొల్లపల్లిలో ఆదివారం నిర్వహిస్తున్న ఓబీసీ సింహగర్జన మహాసభకు శ్రీరంగాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివెళ్లారు. తెలంగాణ లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ ఆధ్వర్యంలో నాయకులు సభకు బయలుదేరారు.పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహాసభకు కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్లాయి. రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఓబీసీల హక్కుల సాధన, కులగణన, జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం సాధించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలని నాయకులు ఆకాంక్షించారు.ఓబీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ఐక్యంగా కృషి చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు జీవో 641 రద్దు చేయాలి

* **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



ప్రజాస్ఫూర్తి ,షాద్‌నగర్:సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మద్దతు తెలిపారు.దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యమకారులకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ విజయ్ హాజరుకాగా, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, భూగర్భ జలాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల కాలుష్య సమస్యలు ఉన్నాయని, ప్రజలకు నష్టం కలిగించే డంపింగ్ యార్డు ఏర్పాటును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రాంబల్ నాయక్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, సామాజికవేత్త వనమాల, జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు మంత్రుల పర్యటన

ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుంది

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాస్ఫూర్తి, భైంసా :నిర్మల్ జిల్లాలో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అధికారులు హాజరుకానున్నట్లు వివరించారు.మంత్రుల పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.మంత్రుల పర్యటన ఉన్నప్పటికీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక విభాగంలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఆర్టీసీ హక్కుల కోసం కత్తెరకు ఓటేయాలి: రవి పటేల్



భూపాలపల్లి,(ప్రజాస్ఫూర్తి):ఆర్టీసీ కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం పోరాడుతున్న తెలంగాణ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ కు మద్దతుగా కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ కోరారు. ఆదివారం భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో బిడబ్ల్యుయు-టీఆర్పీఆధ్వర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.రవి పటేల్ జిల్లా నాయకులతో కలిసి డ్రైవర్లు, కండక్టర్లు, టెక్నీషియన్లు, ఇతర సిబ్బందిని కలిసి కత్తెర గుర్తుపై ఓటు వేసి బిడబ్ల్యుయు-టీఆర్పీఅభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేసి యూనియన్ మేనిఫెస్టోలోని ప్రధాన అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు ఇనుగల ప్రణయ్ రాజ్, సామల చంద్రశేఖర్, కుమార్, అరవింద్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించడమే తన ధ్యేయం

*** ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్**



ప్రజాస్ఫూర్తి,భైంసా:రాజకీయాలకతీతంగా ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు.ఆదివారం భైంసాలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఇండస్ట్రీ లో 129 మంది లబ్ధిదారులకు 36 లక్షల పదమూడు వేల రూపాయల చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటినుండి ఇప్పటివరకు ఐదువేల మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరిగిందన్నారు. పేదవాడు ఆసుపత్రిపాలై పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని,అటువంటి సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కొంత ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ తుమ్మెల దత్తాత్రి,సీనియర్ నాయకులు సోలంకి భీమ్ రావ్,సర్పంచ్ ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పండిత్ రావ్ పటేల్. బిజెపి పట్టణ మండలాల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మ రెడ్డి, యేశాల దత్తాత్రి, సాయన్న, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు అప్పాల రాకేష్, సాయినాథ్ ,సర్పంచ్ లు, మాజీ ఎంపిటిసిలు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క–సారలమ్మ అమ్మవారి సన్నిధిలో మాజీ ఎంపీటీసీ వీరభద్రం



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి:తెలంగాణ ప్రజల ఆశీస్సులతో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఇంకా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య , పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించి, ఇద్దరూ మంత్రివర్గంలో కీలక స్థానాలు అలంకరించాలని ఆకాంక్షిస్తూ...ఈశ్వర మాదారం, రాజుపేట బజార్ ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీశ్రేణులు, అభిమానులతో కలిసి పెరికసింగారం మాజీ ఎంపీటీసీ ,మోదుగు వీరభద్రం ఆధ్వర్యంలో మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల సన్నిధికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మోదుగు వీరభద్రం నిలువెత్తు బంగారాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించి, తెలంగాణ రాష్ట్రానికి మంచి భవిష్యత్తు కలగాలని, ప్రజల ఆశయాలు నెరవేరాలని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు స్థానిక బిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు బంధువులు పాల్గొన్నారు.

రేకొండలో బీరు సీసాతో యువకుడిపై దాడి

*** బెల్ట్ షాప్ లో మద్యం సేవిస్తుండగా ఘర్షణ..**



చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:చిగురుమామిడి మండలంలో యథేచ్ఛగా వెలిసిన బెల్ట్ షాపులే నేరాలకు నిలయాలుగా మారుతున్నాయనడానికి నిదర్శనంగా మండలంలోని రేకొండ గ్రామంలో శనివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది.రేకొండ గ్రామానికి చెందిన పంకెర్ల రాజు అనే వ్యక్తి, దాసరి సాగర్ రెడ్డి అనే వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.ఈ దాడిలో సాగర్ రెడ్డి తలకు తీవ్ర గాయమై, విపరీతంగా రక్తస్రావం అయిందని,వెంటనే స్థానికులు గమనించి అతన్ని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి కారులో తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ మాట్లాడుతూ గాయపడిన దాసరి సాగర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పంకెర్ల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుడిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

*** బెల్ట్ షాపులే కారణమంటున్న గ్రామస్తులు..**

రేకొండతో పాటు చిగురుమామిడి చుట్టుపక్కల గ్రామాల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల వెలుస్తుండడంతో ఇలాంటి ఘర్షణలు,దాడులు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులోనే ఈ దాడి జరిగిందని,మండలంలోని అక్రమ బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బెల్ట్ షాపులపై ఎక్సైజ్,పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.పాత కక్షలను దృష్టిలో పెట్టుకునే తనపై దాడి చేశాడని,రేకొండ గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడని సోషల్ మీడియాలో పోస్టులు చేయడానికి దృష్టిలో పెట్టుకొని తనపై బీర్ సీసాతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని బాధితుడు సాగర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

రహదారులపై పంటను ఆరబెట్టి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు

*** ముథోల్ సీఐ రవీందర్ నాయక్**



ప్రజాస్ఫూర్తి, భైంసా: రహదారులపై సోయా పంటను ఆరబెట్టి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ముథోల్ సీఐ రవీందర్ నాయక్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ పరిధిలోని రహదారులపై ఆరబెట్టిన సోయా పంటను ఆయన పరిశీలించారు.కోత కోసిన సోయా పంటను రహదారులపై కాకుండా పొలాలు, ఖాళీ స్థలాలు, ఇతర అనువైన ప్రదేశాల్లో ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై ఉన్నపంటవాహనదారులకు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పంటను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. రహదారులపై పంటలను ఆరబెట్టి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైతులు రహదారులపై పంటలు ఆరబెట్టకుండా సహకరించాలని కోరారు.

ఉల్లాసంగా జిల్లా సీబీ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ ను,ప్రకాశం స్టేడియం లో నిర్వహించిన పోటీలను రాష్ట్ర క్రాంగ్రెస్ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు ముఖ్య అతిథిగా హాజరై ఒలింపిక్ జెండా ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురతో పాటు బాలికలు కూడా అధిక సంఖ్యలో అథ్లెటిక్స్‌లో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనడం ఆనందదాయకమని, ఎండను సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు మాట్లాడుతూ వరుసగా రాష్ట్ర ఛాంపియన్లుగా జిల్లా అథ్లెటిక్స్ నిలుస్తుండటం గర్వకారణమని, అదే స్ఫూర్తితో రాబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయి కి చేరాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ , సీనియర్ క్రీడాకారుడు ఎండీ. బాబ్జీ ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ వెంకటేశ్వర్లు ,అథ్లెటిక్స్ కోచ్ లు మల్లికార్జున్ రావు , నాగరాజు,. నాగేందర్, గిరి ప్రసాద్, రియాజ్ పాషా, కిన్నెరసాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్త రామదాసు కళాక్షేత్రంలో ఘనంగా గాన రవళి–30



ప్రజాస్ఫూర్తి , ఖమ్మం జిల్లా:ఖమ్మం పట్టణములు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో గాన రవళి-30 నిర్వహణలో రాధా రాగమాలిక పేరుతో ప్రత్యేక సంగీత గానలహరి కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. రాధా నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.వి. రెడ్డి, విశిష్ట అతిథులుగా జయ లక్ష్మీనారాయణ, నందిగామ రాజ్ కుమార్, సెలవోజు చంద్రమౌళి, ఎం. గిరిజాదేవి, హాజరై కళాకారులను, సంగీతాభిమానులను అభినందించారు. సంగీతం అనేది కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా మనసుకు ఆహ్లాదాన్ని,ఆలోచనలకు ప్రశాంతతను అందించే గొప్ప కళారూపం. ఈ నేపథ్యంలో రాధా రాగమాలిక కార్యక్రమం సంగీత ప్రియులకు మధురానుభూతిని కలిగించేలా సాగింది. గాయకుల స్వరాలు, సంగీత వాయిద్యాల సమన్వయం, కళాకారుల ప్రతిభ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ముఖ్యంగా పాతతరం మధుర గీతాల నుంచి నేటి తరానికి చేరువైన పాటల వరకు సంగీతాన్ని అందించడం ద్వారా వివిధ వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. సంగీతం ద్వారా తరాల మధ్య అనుబంధాన్ని పెంపొందించడంతో పాటు తెలుగు సాంస్కృతిక విలువలను పరిరక్షించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. కార్యక్రమం సంగీత ప్రియుల ప్రశంసలు అందుకుంటూ ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో గాయని గాయకులు కీర్తన,ఎం స్వప్న, పల్లపు లక్ష్మీ ప్రసన్న, పంజా మాలతి నాయుడు, విజయ ఫణి కుమార్, శ్రావణ్ కుమార్, నాగభూషణం, శంకర్, ఉయ్యాల శేఖర్, తుంగ వెంకటేశ్వరరావు, గద్దల కుటుంబరావు, భీమాల వినోద్, ఎం ప్రమీల,వి కళ్యాణి,ఎం సురేఖరవి, రమ, శకుంతల, నవీన్, ముల్లపురి లక్ష్మయ్య, జడ్చారి వెంకటేశ్వర్లు, బి ముత్యం, జి ఎల్లయ్య, జి సుధాకర్, టి దేవమని, కే శ్యామ్సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్యంలో ఏకత్వం...చింతల్ మలయాళీ సమాజం

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: వైవిధ్యంలో ఏకత్వం చింతల్ మలయాళీ సమాజమని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. ఆదివారం ఐడిపిఎల్ లోని ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ లో చింతల్ మలయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ వార్షికోత్సవ "మలయాళీ కుటుంబ సభ్యుల గెట్ టు గెదర్" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రాంతాలకు అతీతంగా 2023 ఎన్నికల్లో నాకు సంపూర్ణ మద్దతు తెలిపి అఖండ విజయాన్ని అందించిన మీకందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో చింతల్ మలయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయన్, సెక్రెటరీ జయరాజన్, ప్రోగ్రామ్ కన్వీనర్ రాజన్, కన్నత్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సురేంద్రన్, మలబార్ గోల్డ్ ఎండి జిజెశ్, ఇంక్రెడిబుల్ ఇండియా రియాల్టర్ విక్రం పిళ్లై, కార్యవర్గ సభ్యులు, మలయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



భూపాలపల్లి,(ప్రజాస్ఫూర్తి) గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తితో పాటు క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిట్యాల మండలం చల్లగరిగె గ్రామంలో నిర్వహించనున్న సీసీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని ఆదివారం ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీలతో గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్నప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు.ఇలాంటి టోర్నమెంట్లను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు, టోర్నమెంట్ నిర్వాహకులు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరు పేదలకు ఆర్థిక చేయూత



ప్రజా స్ఫూర్తి, భైంసా:నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని దేగాం గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అందజేశారు. గ్రామానికి చెందిన గంగాధరోళ్ల సునీత, పల్సి లక్ష్మి, ద్యావరీ చిన్నమ్మి, అయిండ్ల లక్కీ రెడ్డి ల కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిరం సుష్మరెడ్డి మాట్లాడుతూ సిఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు.తమ గ్రామం లో ఎంతో మందికి సహాయం చేయడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి:ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ అన్నారు.ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మహబూబాబాద్ లోకల్ డిపోలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూయూ, ఎస్డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని ఆర్టీసీ కార్మికులను కోరారు.కార్మికుల హక్కులు,సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూగూలోత్ జ్యోతి, ఆర్టీసీ మెంబర్ రావుల మురళి, కౌన్సిలర్లు,జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,ఆర్టీసీ కార్మికులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ చంద్రస్వామి మాస కళ్యాణం

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరంలోని శ్రీ సీతారామచంద్రస్వామి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా ఆదివారం మాస కళ్యాణం ను దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. శాస్త్రోక్తంగా మాంగల్య ధారణతో కళ్యాణ తంతు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్,భక్తులు ఈగ వెంకటేశ్వర్లు, షీలా శంకర్, సోమ సుమన్, వీరవెల్లి రామ్మూర్తి, అప్పారావు, గన్నవరపు రమణ, కొత్తూరు రాజు, కక్కిరేణి విజయ్, అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, మందిరం మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.


ఓసియానికి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఘనంగా బుక్ లాంచ్ ఈవెంట్



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం జిల్లా:ఖమ్మం నగరంలోని వంశీ ఎంపైర్ హోటల్‌లో ఓసియానికి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో బుక్ నిర్వాహకులు ఫణీంద్ర పసుమర్తి, మర్రి సాయికుమార్ ఆధ్వర్యంలో బుక్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. సాహిత్యం, పుస్తక ప్రచురణ రంగాల అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, ఖమ్మం ఏసిపి విజయ్ బాబు, స్పెషల్ గెస్ట్‌గా డాక్టర్ రమేష్ కళ్యాణ్,చల్ల శ్రీ గౌరీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నూతన పుస్తకాన్ని ఆవిష్కరించడం ద్వారా రచయితల సృజనాత్మక ఆలోచనలను పాఠకులకు చేరువ చేయడంలో ప్రచురణ సంస్థల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. ఈ పుస్తకంలో ప్రేమ గొప్పతనాన్ని తెలియపరుస్తుందని రెండవ పుస్తకంలో కాశి లో జరిగిన అనేకమైన అద్భుతాలను వివరిస్తుందని పుస్తక నిర్వాహకులు తెలియజేశారు. పుస్తకం అనేది కేవలం అక్షరాల సమాహారం కాదని, సమాజాన్ని ఆలోచింపజేసే శక్తివంతమైన సాధనమని అభిప్రాయపడ్డారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తక పఠనం తగ్గుతున్నప్పటికీ, మంచి సాహిత్యానికి ఎప్పటికీ ఆదరణ ఉంటుందని, యువతలో పఠనాసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ బుక్ లాంచ్ ఈవెంట్ ఖమ్మం సాహిత్య, ప్రచురణ రంగంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బంధుమిత్రుల ఆధ్వర్యంలో చిన్ననాటి మిత్రులు పాల్గొని వారిరువురికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదేకాదు జీవితంలో అనేకమైన మైలురాళ్లు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

మల్లన్నసాగర్ నీటిని ఎలా తరలిస్తారు?

*** ముందుగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి: హరీశ్‌రావు**



గజ్వేల్: మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీటిని ఎలా తరలిస్తారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముందుగా నిర్వాసితుల పెండింగ్ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం తురకకాశ కుటుంబాలకు రాతికోత యంత్రాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్వాసితుల పక్షాన దీక్ష చేసిన రేవంత్‌రెడ్డి, తాము అధికారంలోకి వస్తే రెట్టింపు పరిహారం ఇస్తామని ప్రకటించారని, అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. నిర్వాసితుల కోసం మాజీ సీఎం కేసీఆర్ పెద్ద మనసు చేసుకుని ప్రతి కుటుంబానికి 250 గజాల స్థలంలో రూ.5.04 లక్షలతో ఇళ్లు కట్టించారన్నారు. ప్రస్తుతం పదిపైసల వంతు మాత్రమే పనులు మిగిలాయని వాటిని పూర్తి చేసేందుకు రేవంత్‌రెడ్డికి చేతులు రావడం లేదని విమర్శించారు.

తెలంగాణ కథా సాహిత్యం చారిత్రాత్మకమైంది

*** కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి, కథకులు డాక్టర్ నందిని సిధారెడ్డి**



ప్రజాస్ఫూర్తి , ఖమ్మం జిల్లా: తెలంగాణ కథా సాహిత్యం చారిత్రాత్మకమైనది, జీవితమంత విశాలమైనదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి రచయిత కథకులు తెలంగాణ సాహిత్య అకాడెమీ పూర్వ అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం కథా స్ఫూర్తి సాహిత్య ఉత్సవం , వేదిక ఫంక్షన్ హాల్లో కథా తెలంగాణ ప్రత్యేక కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధరణికోట రమేష్ కుమార్, ప్రసేన్, సీతారాం, రవి మారుత్ సంపాదకత్వంలో వెలువడిన గుమ్మి తెలంగాణ కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ కథ విస్మరణ కు గురైందని ఆయన ఆవేదన చెందారు. తెలుగుకథలో తెలంగాణ కథా ఉంటుందన్నారు. తొలుత కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు కవి, విమర్శకులు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో ఖమ్మం కథా స్ఫూర్తి వేదిక కార్యదర్శి ధరణికోట రమేష్ కుమార్ లక్ష్యప్రకటనలో భాగంగా తెలంగాణ లో కథలేదనే విమర్శకు ధీటుగా కథ ఎంత విస్తృతంగా ఈ ప్రాంతం నుంచి వచ్చిందో తెలపడానికి గుమ్మి కథా తెలంగాణ ని తీసుకురావడంతో పాటు ఈ సంవత్సరం నుంచి కథా పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ కవి విమర్శకులు తెలంగాణ సాహిత్య చరిత్ర రచయిత డా.సుంకిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు కంటే ముందు నుంచి తెలంగాణ కథ మొదలైన చారిత్రక సామాజిక రాజకీయ సాంస్కృతిక విభిన్నతను సోదాహరణంగా వివరించారు. ప్రముఖ కథా రచయిత్రులు స్వర్ణ కిలారి, గోడవతల'" శ్రీ ఊహ, "సిక్కా"రచయితలు గాజోజి నాగభూషణం" జీవన సాఫల్యత" కొట్టం రామకృష్ణారెడ్డి "చీకటి యుద్ధం"కథా సంపుటాలకు ఖమ్మం కథా పురస్కారాలు 2026 అందుకున్నారు. తమ స్పందనలను తెలియజేశారు. కార్యక్రమంలో కథా రచయితలు మన్ ప్రీత్, అరుణ్ మన్నెపల్లియా , అరుణ్ కుమార్, సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్ వనపట్ల సుబ్బయ్య ఎదిరేపల్లి కాశన్న తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు రచయితలు, స్థానిక కవులు ఇబ్రహీం నిర్గుణ్ శ్రీనివాస్ సూఫి,కన్నెగంటి వెంకటయ్య, నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, తోటి సుభాషిణి, మువ్వా జయశ్రీ, ఫణి మాధవి, రౌతు రవి, ఎన్.తిర్మల్ తదితర సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు .

తెలంగాణలో శ్వేత విప్లవం తూప్రాన్ డెయిరీ ప్లాంట్ నాంది

*** రూ.400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్**

*** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఆదివారం సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు మాత్రమే కాదని, తెలంగాణ పాడి రైతుల ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి, స్థానిక మహిళలు, యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యమన్నారు.రైతులు ఉత్పత్తి చేసిన పాలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు అందుబాటులోలేకపోవడంతోఆశించిన ఆదాయం పొందలేకపోతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు.వ్యవసాయం అంటే వరి, పత్తి, మిర్చి పంటలే కాకుండా భూమి ఉన్నా లేకపోయినా పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమ అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు.రైతులంతా విడివిడిగా కాకుండా సహకార సంఘాలుగా ఏర్పడి సమష్టిగా పనిచేస్తే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగవచ్చని అన్నారు.

*** అమూల్ విజయమే రైతుల విజయం**

సహకార వ్యవస్థతో ఎలాంటి మార్పు సాధ్యమో సాబర్ డెయిరీ ప్రయాణమే నిదర్శనమని పేర్కొన్నారు. అమూల్ సహకార నెట్‌వర్క్ ద్వారా ఏటా సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పశువుల దాణాను రైతులకు అందిస్తున్నారని, పశువైద్య సేవలను రైతుల ఇళ్ల వద్దకే తీసుకెళ్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా అమూల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, 50కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అమూల్ సాధిస్తున్న గుర్తింపు భారత రైతుల విజయానికి నిదర్శనమన్నారు.శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి దేశవ్యాప్తంగా 75 వేల కొత్త పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తెలంగాణలోనూ 1,525 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు.

*** రైతు బలపడితే దేశం బలపడుతుంది**

ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేస్తున్న దేశంగా భారత్ నిలిచిందని, ప్రపంచ పాల ఉత్పత్తిలో దాదాపు నాలుగో వంతు వాటా భారత్‌దేనని పేర్కొన్నారు.హరిత విప్లవం వ్యవసాయ రంగానికి, నీలి విప్లవం మత్స్యరంగానికి కొత్త శక్తినిచ్చినట్లే శ్వేత విప్లవం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో సహకార రంగం కీలక స్తంభంగా నిలవాలన్నదే లక్ష్యమని తెలిపారు.శ్వేత విప్లవం 2.0 ద్వారా రైతులకు అదనపు ఆదాయం, యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వావలంబన, గ్రామాలకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ పాడి రైతులు సహకార ఉద్యమంలో భాగస్వాములై రాష్ట్రాన్ని శ్వేత విప్లవంలో ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు. రైతు బలపడితే గ్రామం బలపడుతుంది.. గ్రామం బలపడితే తెలంగాణ, దేశం బలపడతాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి , ఐటి శాఖామంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు,సాబర్ డైరీ చైర్మన్ శ్యామ్ లాల్ జి పటేల్, కోపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలోపటిష్ట నిఘా ఏర్పాటులో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడతాయి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి:నేర నియంత్రణలోపటిష్టనిఘా ఏర్పాటులో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడతాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు.ఆదివారం సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ విజయదుర్గా కాలనీ (జీపీఆర్) లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూసీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని, కాలనీలోకి వచ్చి వెళ్లే రహదారులను గుర్తించి సీసీ కెమెరా ఏర్పాటు ద్వారా సేఫ్ అండ్ స్మార్ట్ కాలనీగా విజయదుర్గ కాలనీ నిలుస్తుంది అన్నారు.వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోలీసులతో కలిసి ప్లాటజిక్ పాయింట్లను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీ రక్షణ మరింత బలపడుతుందన్నారు.అదేవిధంగా రోజురోజుకు పెరుగుతున్న జనాభా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో త్రాగునీటి, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా విజయ దుర్గా కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, రాము రాథోడ్, డీఈ పాపమ్మ, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ అధికారులు, మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, విజయ దుర్గ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్యాంసింగ్, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సభ్యులు ఎస్. రాకేష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుమన్, వైయస్, బి. సందీప్, విశ్వనాథ రెడ్డి, వినోద్, శివ నాగరాజు, యుగంధర్, దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రవి కిరణ్, బాలాజీ నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, మధుసూదన్ రెడ్డి, చంద్రయ్య, బొబ్బ శ్రీను, పోతినేని ప్రవీణ్, యశ్వంత్, మహమ్మద్ సలీం, మహిళా నాయకురాలు లతా రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పెయిన్ కిల్లర్స్ అతిగా వాడితే..

కొత్త నొప్పులే..

మనలో చాలా మంది కాస్త తలనొప్పి అనిపించగానే పెయిన్ కిల్లర్స్ వాడుతుంటారు. బాడీ పెయిన్స్‌కి కూడా ట్యాబ్లెట్స్‌ను వేసుకుంటారు. అయితే పెయిన్ కిలర్స్‌ని వాడడం వల్ల వెంటనే నొప్పి తగ్గిన భావన కలిగినా దీర్ఘకాలంలో మాత్రం తీవ్ర సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు.




పెయిన్ కిల్లర్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు...

* పెయిన్ కిల్లర్స్ వేసుకోగానే నొప్పి తగ్గిన భావన కలిగినా తర్వాత తలనొప్పి పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌ను అతిగా వాడే వారిలో తరచూ తలనొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.
* కొన్ని రకాల పెయిన్ కిల్లర్స్‌ని ఎక్కువ రోజులు వాడడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కడుపులో చికాకు, అల్సర్, అంతర్గత రక్తస్రావం వంటి సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
* ఇక ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా వేసుకోవడం వల్ల ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో కిడ్నీలు దెబ్బతినడం ఒకటి. పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడే వారిలో మూత్రపిండాల వైఫల్యం ఎక్కువగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.
* పెయిన్ కిల్లర్స్‌ను అధికంగా వాడడం వల్ల కాలేయంపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎసిటమైనోఫెన్ ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయ వైఫల్యానికి దారి తీస్తుంది. పెయిల్ కిల్లర్స్‌ను వాడే సమయంలో కొన్ని పద్ధతులు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌ను తీసుకునే సమయంలో ఒక ట్యాబ్లెట్‌కి మరో ట్యాబ్లెట్‌కి మధ్య కనీసం 5 గంటలు ఉండేలా చూసుకోవాలి. అలాగే వారానికి 23 సార్లు కంటే ఎక్కువ తీసుకోకూడదు. నొప్పి చాలా కాలం పాటు కొనసాగితే లేదా తరచుగా సంభవిస్తే వైద్యుడిని సంప్రదించాలి. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు. పైన తెలిపిన వివరాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు అందించినవి మాత్రమే. ఆరోగ్యానికి సంబంధించి వైద్యుల సూచనలు పాటించడమే ఉత్తమం.



చలికాలంలో ఉపిరితిత్తులను కాపాడుకోవడం ఎలా?




చలికాలం.. ఊరితిత్తులకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ ఊపిరితిత్తులను ఎలా కాపాడుకోవాలి? శ్వాస కోస వ్యాధులు రాకుండా ఎలా కాపాడుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. చలికాలంలో ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టడం వల్ల చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. చల్లని, పొడి గాలి, అలాగే వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. చల్లని గాలి మన ఊపిరితిత్తులలోకి ప్రవేశించినప్పుడు.. అది శ్వాస సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. దీని వల్ల దగ్గు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోవటానికి జాగ్రత్తగా ఉండటం, సరైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. వైద్య నిపుణుల ప్రకారం.. శీతాకాలంలో చల్లని గాలి ఊపిరితిత్తులకు కష్టంగా ఉంటుంది. ఇది మన శ్వాస గొట్టాన్ని ఇబ్బందికి గురి చేస్తుంది. చల్లని, పొడి గాలి కూడా అలెర్జీలు, ఇన్ఫెక్షన్లను పెంచుతాయి.

చలికాలంలో కాలుష్యం పెరగడమే అతిపెద్ద సమస్య..

చలికాలంలో బలహీనంగా మారిన ఊపిరితిత్తులపై మరింత ఒత్తిడి తెచ్చే పొగ, ధూళి కణాలు ఈ సమయంలో మరింత చురుగ్గా మారతాయి. ముఖ్యంగా ఉబ్బసం రోగులకు, చల్లని గాలి వారి లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. చల్లటి, కలుషితమైన గాలిని పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మాత్రమే కాకుండా ఊపిరితిత్తులలో మంట, ఇన్ఫెక్షన్ కూడా వస్తుంది. ఇంతే కాకుండా.. శీతాకాలంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది . శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి, సీజనల్ ఫీవర్, జలుబు వంటి సమస్యలు వస్తాయి.

తీసుకోవాల్సిన చర్యలు..

ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. సమతుల్య ఆహారం తీసుకోండి. మిమ్మల్ని మీరు హైడ్రేట్ గా ఉంచుకోండి. హైడ్రేషన్ ఊపిరితిత్తులను తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శ్వాసను సులభతరం చేస్తుంది. దుమ్ము మరియు పొగకు దూరంగా ఉండండి. ఎవరైనా.. శీతాకాలంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రారంభ చికిత్సతో తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అంతే కాకుండా మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దుమ్ము, పొగ నుంచి దూరంగా ఉండటం ముఖ్యం.



పాలు మంచివేనా? ఉబకాయం ఉన్నోళ్లు తాగొచ్చా?

ఇటీవల ఉబకాయం అనే సమస్య చాలా మందిని వేదిస్తోంది. దీంతో ఏ ఫుడ్ తీసుకోవాలో.. ఏ ఫుడ్ తీసుకోవొద్దో తెలియక వారు తికమక పడుతున్నారు. అయితే ఇప్పటివరకు హెల్తీ అనుకున్న పాలు కూడా.. ఇప్పుడు అన్ హెల్తీ అన్న టాక్ వస్తోంది. ముఖ్యమంత్రి ఉబకాయం ఉన్నోళ్లు పాలు తాగొద్దని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

ప్రస్తుత కాలంలో చాలా మందిని కొవ్వు (కొలెస్ట్రాల్) సమస్య వేధిస్తోంది. దీని కారణంగా శరీర బరువు భారీగా పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యను ఎదుర్కొంటున్న వారు ఏం తినాలన్నా, తాగాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటారు. ఏం తింటే ఏమవుతుందో అనే భయంతో కొన్ని ఆహార పదార్థాలను తినడం, తాగడం మానేస్తున్నారు. ఈ లిస్టులో మొదటి స్థానంలో వచ్చేది పాలు.పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఒకేసారి లభిస్తాయి. అందుకే రోజు కనీసం ఒక గ్లాసు పాలు తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తారు. పాలు తాగడం వల్ల బలమైన ఎముకలకు అవసరమైన కాల్షియంను అందిస్తుంది. అంతే కాకుండా.. శరీరానికి కావాల్సిన అవసరమైన అనేక ఖనిజాలు, విటమిన్లు పాలలో నుంచి లభిస్తాయి. అయితే.. పాలు తాగితే బరువు పెరగడం కూడా ముడిపడి ఉంది. బరువు పెరుగుతుందనే భయంతో చాలా మంది పాలు తాగరు. అయితే పాలు తాగడం వల్ల ఊబకాయం పెరుగుతుందా..? అనే దానికి వివరాలు తెలుసుకుందాం... పాలలో పోషకాలతో పాటు, కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో.. అధిక మొత్తంలో పాలు తాగడం వలన ఊబకాయానికి దారి తీస్తుంది. అయితే, కొన్ని ప్రత్యేక విషయాలపై శ్రద్ధ పెడితే.. పాలు తాగితే బరువు పెరిగే ప్రమాదాన్ని సులభంగా తగ్గించుకోవచ్చు.



పాలు తాగడంవలన బరువు తగ్గే సరైన మార్గం ఏమిటి..?

మీరు మీ బరువును నియంత్రించుకోవడానికి పాలు తాగేటప్పుడు కేలరీలను తగ్గించాలి. అందు కోసం.. ఎక్కువ పరిమాణంలో పాలు తాగడం మానుకోండి. అంతే కాకుండా.. పాలలో కేలరీల పరిమాణాన్ని తగ్గించడానికి, మొత్తం పాలకు బదులుగా స్కిమ్డ్ మిల్క్ తీసుకోండి. అంటే.. పాల నుండి మీగడను పూర్తిగా తీసివేసి తాగండి. 1 గ్లాసు మొత్తం కొవ్వు పాలలో 146 కేలరీలు, కొవ్వు లేని పాలలో 86 కేలరీలు ఉంటాయి. ఈ క్రమంలో.. మీ అవసరాన్ని బట్టి సరైన పాలను తాగాలి. మీరు బరువు తగ్గించే డైట్‌లో ఉన్నట్లయితే.. మీ రోజువారీ కేలరీల కౌంట్‌ను దృష్టిలో ఉంచుకుని పాలను తీసుకోవాలి.



కాజు హల్వా ..

ఇలా ప్రిపేర్ చేసుకోండి.. !



దీపావళి పండగకు చాలా మంది స్వీట్స్ తింటూ ఉంటారు. అలాగే ఇంటికి వచ్చే అతిథులకు బహుమతిగా ఈ స్వీట్స్ ఇస్తూ ఉంటారు. దీనికోసం షాపుల నుంచి స్వీట్స్ తీసుకొని ఇస్తారు. కానీ ఈ దీపావళికి స్వీట్స్ బయటి నుంచి కాకుండా ఇంట్లోనే చేసి తినడంతో పాటు, మీ ఇంటికి వచ్చిన అతిథులకు కూడా ఇస్తే చాలా బాగుంటుంది. అందుకే కాజు హల్వా అనేది బెస్ట్ ఆప్షన్ అని చెప్పుకోవచ్చు. యితే ఈ కాజు హల్వాను ఎలా చేసుకోవాలి, దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి, ఎలాంటి పద్ధతుల్లో హల్వా చేసుకుంటే రుచి అమోఘంగా వస్తుందనేది ఈ స్టోరీలో చూద్దాం.



కాజు హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు
గోధుమ పిండి
కుంకుమ పువ్వు
జీడిపప్పు
పంచదార లేదా వీలైతే బెల్లం పొడి
నెయ్యి
యాలకుల పొడి
డ్రై ఫ్రూట్స్

కాజు హల్వా తయారీ విధానం

ఈ కాజు హల్వా తయారు చేయడానికి ముందుగా జీడిపప్పును మెత్తగా పొడి చేసుకొని పక్కకు పెట్టుకోవాలి. అనంతరం ఒక గిన్నె తీసుకొని అందులో నీళ్లు పోసి మరిగించండి. నీళ్లు మరిగాక అందులో పంచదార లేదా బెల్లం పొడి వేసి, మంటను హైలో పెట్టి అది కరిగేంత వరకు మరిగించుకోవాలి. ఆ సమయంలోనే అందులో యాలకుల పొడి, కుంకుమ పూల రేకులు వేసి కొంచెం సేపు మరిగించుకొని పక్కకు పెట్టుకోవాలి.అనంతరం మరొక గిన్నె తీసుకొని అందులో నెయ్యి వేసి.. అందులోనే గోధుమ పిండి, పిండిలా చేసుకున్న జీడిపప్పును వేయించాలి. ముఖ్యంగా మాడిపోకుండా చూసుకోవాలి. అనంతరం ఆ పిండిలో మనం ముందుగా చేసి పెట్టుకున్న పంచదార లేదా బెల్లం పొడితో చేసుకున్న పాకంను పోసి మెల్లమెల్లగా కలుపుకోవాలి. ఉండలు లేకుండా, మిశ్రమం దగ్గర పడే కొద్దీ కలుపుకుంటూ ఉండాలి. అనంతరం ఒక బౌల్‌లో ఆ హల్వాను వేసుకొని దానిపై కొన్ని డ్రై ఫ్రూట్స్ స్లైసెస్‌ను గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది. దీపావళికి ఎంతో రుచికరమైన కాజు హల్వా సిధమైనట్లే.





మైసాకు పోటీగా జేజమ్మ మలయాళం మూవీ

బాక్సాఫీస్ వద్ద నేషనల్ క్రష్ రష్మిక మందన్నతో అనుష్క పోటీ పడబోతుంది. ఈ టాలీవుడ్ హీరోయిన్లు నటించిన సినిమాలు ఒకే రోజు థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన మైసా టీజర్‌తో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ఈ మూవీ నవంబర్ 27న థియేటర్లలోకి రాబోతుంది. పాన్ ఇండియన్ లెవెల్‌లో తెలుగుతో పాటు మరో నాలుగు భాషల్లో ఈ సినిమా విడుదల చేయబోతున్నారు. మైసాకు పోటీగా అనుష్క మలయాళం డెబ్యూ మూవీ కథనార్ థియేటర్ల లోకి రాబోతున్నట్లు సమాచారం. పీరియాడికల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాను నవంబర్ 27న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేసినట్లు తెలిసింది.

పెద్ది డైరెక్టర్‌తో మెగాస్టార్ మూవీ



రామ్‌చరణ్ పెద్ది తర్వాత తన తదుపరి సినిమాను మెగా హీరోతోనే చేయబోతున్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. పెద్ది కమర్షియల్ ఫెయిల్యూర్‌గా నిలిచినా బుచ్చిబాబు సానా టేకింగ్‌కు ప్రశంసలు దక్కాయి. మెగాస్టార్ చిరంజీవితో బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఓ పాన్ ఇండియన్ మూవీ కన్ఫామ్ అయినట్లు చెబుతోన్నారు. పెద్ది సినిమా విషయంలో డైరెక్టర్ పనితీరుకు ఇంప్రెస్ అయిన చిరంజీవి ఓ కథ రెడీ చేసుకోమని చెప్పినట్లు సమాచారం. చిరంజీవి ఇమేజ్‌కు తగ్గట్లుగా రా అండర్ రస్టిక్ పాయింట్‌తో స్టోరీ రాసుకున్న బుచ్చిబాబు...ఇటీవలే మెగాస్టార్‌ను కలిసి వినిపించినట్లు సమాచారం. చిరంజీవికి కూడా కథతో పాటు అందులోని ఎమోషన్స్ బాగా నచ్చినట్లు చెబుతున్నారు. ఫుల్ బౌండ్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకోమని చెప్పినట్లు టాక్ వినిపిస్తోంది.



అనుపమ డబుల్ ట్రీట్

తెలుగు ఆడియెన్స్‌కు అనుపమ పరమేశ్వరన్ డబుల్ ట్రీట్ ఇవ్వబోతుంది. ఆమె హీరోయిన్‌గా నటించిన రెండు సినిమాలు రెండు వారాల గ్యాప్‌లో థియేటర్లలోకి రాబోతున్నాయి. ఈ రెండు సినిమాలు తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లోనే రూపొందడం గమనార్హం. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ హీరోహీరోయిన్లుగా నటించిన భోగి టీజర్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ అంశాలతో ఈ టీజర్ ఆసక్తికరంగా సాగింది. ఈ టీజర్‌లో పల్లెటూరి అమ్మాయిగా డీ గ్లామర్ పాత్రలతో అనుపమ పరమేశ్వరన్ కనిపించింది. శర్వానంద్, అనుపమ లుక్స్, వారిద్దరి ట్రాన్స్‌ఫర్మేషన్, మేకోవర్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. నవంబర్ 12న ఈ యాక్షన్ మూవీ థియేటర్లలోకి రానున్నట్లు ప్రకటించారు.

మమితా బైజుకు జాక్‌పాట్

మమితా బైజు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, బెత్లెహం కుటుంబ యూనిట్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాశాయి. ఈ విజయాలతో అమ్మడి అదృష్టం మారిపోయింది. తాజాగా వెంకీ అట్లూరి సినిమాలో నాని సరసన హీరోయిన్‌గా మమితాబైజు కనిపించబోతున్నట్లు తెలిసింది. ఈ సినిమా కోసం అమ్మడికి భారీ రెమ్యూనరేషన్ ఆఫర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఒక్కో సినిమాకు రెండు నుంచి మూడు కోట్ల మధ్య పారితోషికం తీసుకుంటోంది మమితాబైజు. నాని సినిమా కోసం ఆరు కోట్ల పారితోషికం డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు.



ఫర్జీ 2 నుంచి రాశీఖన్నా ఔట్

దర్శకద్వయం రాజ్‌డీకే రూపొందించిన ఫర్జీ వెబ్‌సిరీస్ బాలీవుడ్‌లో విమర్శకుల ప్రశంసలను అందుకుంది. ఇందులో షాహిద్‌కపూర్, విజయ్ సేతుపతి, రాశీఖన్నాతో పాటు పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌కు కొనసాగింపుగా సీజన్ 2 రాబోతుంది. ఫర్జీ 2 నుంచి రాశీఖన్నా తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సీజన్ వన్‌లో మేఘా వ్యాస్ అనే ఆర్‌బీఐ ఆఫీసర్ పాత్రలో రాశీఖన్నా కనిపించింది. పాజిటివ్‌గా కనిపించే నెగెటివ్ క్యారెక్టర్‌లో డిఫరెంట్ వేరియేషన్స్‌తో కూడిన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఫర్జీకి వచ్చిన రెస్పాన్స్‌తో సెకండ్ సీజన్‌లో కూడా రాశీఖన్నా పాత్రను కంటిన్యూ చేయాలని దర్శకద్వయం ప్లాన్ చేశారు. కానీ రజనీకాంత్ ధర్మన్‌తో పాటు మరికొన్ని సినిమాలతో బిజీగా ఉన్న రాశీఖన్నా ఈ వెబ్‌సిరీస్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం.

డైరెక్ట్ గా ఓటీటీలోకి లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్

టాలీవుడ్ కమెడియన్ హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' నేరుగా ఓటీటీలో రిలీజ్ కాబోతుంది. ఈ మూవీ అక్టోబర్ 9 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతుంది. రొమాంటిక్ కామెడీగా రూపొందిన ఈ మూవీలో జీవన్ కుమార్, హైపర్ ఆది, ఐశ్వర్య హోలక్కల్, రూప శ్రావ్య కీలక పాత్రల్లో నటించారు. దీని ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.